క్లుప్తంగా

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలోని శ్రీలక్ష్మీనరసింహా ప్రైవేటు పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ ధర్మాన్ని రక్షించడానికి, దుష్టశక్తులను అంతమొందించడానికి శ్రీకృష్ణుడు జన్మించాడని తెలిపారు. ప్రతి ఏడాది పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా విద్యార్థులు చేపట్టిన కోలాటం, ఉట్టి కొట్టడం వేడుకలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు పురుషోత్తం, దిలీప్‌కుమార్, ధనుంజయరెడ్డి, ఉపాధ్యాయులు హేమలత, సౌమ్య, హంస, వెంకటాద్రి, మమత, కాంచన, తేజోమయి, విద్యార్థులు పాల్గొన్నారు.

బలిజకండ్రిగలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



త్రివర్ణ పతాకంతో ర్యాలీ

పాలసముద్రం: ఆగస్టు 15న భారత స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో హెచ్ఎం కోలా హరిత ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా, హర్ ఘర్ స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మన దేశ చట్టాలను తెలుసుకుని ఒక మంచి పౌరులుగా మారాలన్నారు. అనంతరం జాతీయ పతాకంతో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

నగరి: శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం, విద్యార్థి సంక్షేమ, సాంస్కృతిక వ్యవహారాల సంచాలకత్వం(డీఎస్‌డబ్ల్యూసీఏ), సెట్విన్ సంయుక్త ఆధ్వర్యంలో యువ కనెక్ట్ పేరుతో నిర్వహించిన 'అంతర్జాతీయ యువ దినోత్సవం- 2025'లో నగరి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బృంద గానం విభాగంలో విద్యార్థులు తిరుమూర్తి, బిందు, చాదిని, జయశ్రీ, కరుణ, సాము ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. ఎస్వీయూకి అనుబంధంగా ఉన్న 15 కళాశాలల నుంచి ఈ పోటీలకు విద్యార్థులు పాల్గొన్నారని వారిలో నగరి విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారని ప్రిన్సిపల్ వేణుగోపాల్ తెలిపారు. బుధవారం కళాశాలలో విద్యార్థులను, సాంస్కృతిక కోఆర్డినేటర్ ఎం.అరుణ కుమారిని ఆయన అభినందించారు. విజేతలకు వైస్ ప్రిన్సిపల్ భాస్కర రాజు అధ్యాపకులు ఎం.అరుణ కుమారి, రామానుజులు ప్రశంసించారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు

వెదురుకుప్పం: మాదక ద్రవ్యాల వినియోగంతో అనేక అనర్థాలు తప్పవని చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కో–ఆర్డినేటర్ నాగమణి అన్నారు. గురువారం మండలంలోని చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నియంత్రించాలన్నారు. విద్యతోనే బంగారు భవిష్యత్తు వస్తుందన్నారు. చిన్న పిల్లలప్పుడే క్రమశిక్షణ అలవరచుకుని జీవితాలను సక్రమమైన మార్గంలో తీసుకెళ్లాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలనకు అందరూ కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. చైల్డ్ ప్రాజెక్టు అధికారి శకుంతల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వసంతకుమార్, అధ్యాపకులు సభాపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా కుంభాభిషేకం



కుంభాభిషేకం అనంతరం మహాగణపతి

గంగాధరనెల్లూరు: మండలంలోని పాత వెంకటాపురం పంచాయతీ పరిధిలోని గరిగలపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీమహాగణపతి దేవస్థాన మహా కుంభాభిషేక వేడుకలు వేద పండితుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. మూడు రోజులుగా విశేష ప్రత్యేక పూజలతో కొనసాగిన మహా క్రతువు పండితుల వేదమంత్రోచ్చారణ మధ్య కుంభాభిషేక కార్యక్రమంతో పూర్తయింది. ఈ కార్యక్రమానికి వేలాది మంది ప్రజలు హాజరై స్వామివారిని సందర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బాలికలకు మెరుగైన వసతులు కల్పించాలి

వెదురుకుప్పం: బాలికలకు మెరుగైన వసతులు కల్పించాలని ఎంపీడీఓ పురుషోత్తం అన్నారు. గురువారం వెదురుకుప్పం బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. సరుకులు, వసతులు, చదువులపై ఆరా తీశారు. అంతకు ముందు ఇంటింటికీ చెత్త సేకరణ, ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోదండరామిరెడ్డి, హాస్టల్ వెల్ఫేర్ అధికారి హేమలత పాల్గొన్నారు.

గుంతలు కాదు.. రోడ్లే!

- అవస్థలతో ప్రయాణిస్తున్న వాహనదారులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

పాలసముద్రం: గ్రామీణ ప్రాంతాల రోడ్లు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలనికి కుంటలను తలపిస్తున్నాయి. మండలంలోని ఆముదాల, దీనబంధుపురం, సింహరాజుపురం, ఆముదాల, గంగమాంబపురం రోడ్లు అధ్వాన్నంగా మారాయి. దీంతో గ్రామస్తులు అవస్థలు పడుతూ బురద రోడ్లపై రాకపోకలు సాగిస్తున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో పలు రహదారులు గుంతలమయమయ్యాయి. వర్షపు నీరు నిల్వ ఉండడంతో రోడ్డు మడుగులను తలపిస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణాలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు గ్రామ ప్రజలు ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని ఆయా గ్రామాల ప్రజలు నిట్టూరుస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లు బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కంకరతో ఆగిపోయిన రోడ్లు

గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి ఉన్నప్పుడు ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో మహదేవపురం క్రాస్ నుంచి వీర్లగుడి దళితవాడకు, బలిజకండ్రిగ నుంచి నొచ్చిలికి, రామక్రిష్ణాపురం నుంచి బాలక్రిష్ణాపురం వరకు పోతున్న రోడ్లు ఓట్ల కోసం టీడీపీ నాయకులు ఆర్భాటంగా పనులు చేశారు. కాంట్రాక్టర్ ఆలస్యంగా రోడ్ల పనులు ప్రారంభించి కంకర రాళ్లు రోడ్డుపై వేశారు. అంతటితో ఎన్నికల కోడ్ రావడంతో రోడ్డు పనులు వదిలేశారు. అనంతరం రోడ్డు పనులకు బిల్లులు పెట్టించారు. అయితే ఓ కాంట్రాక్టర్ నగదు తీసుకుని రోడ్డు పనులు చేయలేదు. సుమారు ఐదారేళ్లుగా కంకర రాళ్లపైనే గ్రామ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదికి పైగా అయినా రోడ్డు పనులను పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. కంకర రాళ్లు వేసిన రోడ్డుపై చాలా మంది విద్యార్థులు పడిపోయి గాయాల పాలైనవారు ఎంతో మంది ఉన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలి



వర్షానికి గుళ్లరాళ్లు తేలిపోయిన దీనబంధుపురం రోడ్డు



వర్షానికి గుంతల్లో నీరు నిలిచిపోయిన గంగమాంబపురం రోడ్డు, వర్షానికి దెబ్బతిని రాళ్లు తేలిపోయిన సింహరాజుపురం రోడ్డు, టీడీపీ ప్రభుత్వ హయాంతో కంకర రాళ్లు వేసి ఆగిపోయిన వీర్లగుడి రోడ్డు

క్వారీల్లో మైనింగ్ అధికారుల తనిఖీలు

పాలసముద్రం: మండలంలోని ఆముదాల, రామక్రిష్ణాపురం సమీపంలో ఉన్న క్వారీలను రెండో రోజు బుధవారం కడప మైనింగ్ విజిలెన్స్ ఏడీ సుబ్రమణ్యం, తహశీల్దార్ అరుణకుమారి, ఎస్ఐ చిన్నరెడ్డప్ప కలసి ఎర్రమట్టి గ్రావెల్, రాళ్ల క్వారీలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తమిళనాడు సరిహద్దుల్లో అక్రమంగా ఎర్రమట్టి గ్రావెల్ రవాణాపై చాలా ఫిర్యాదులు వచ్చాయన్నారు. అలాంటివి అరికట్టేందుకే తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్ఓ రమేష్, శంకరయ్య, ఆర్ఐ విమల, గ్రామ సర్వేయర్ అల్లీ, చరిత, దీప పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రజలు, రైతులకు విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా ఇవ్వాలని విద్యుత్ శాఖ ఏడీ, శేషాద్రిరెడ్డి ఏఈ లోకేష్ తెలిపారు. బుధవారం రాచపాళెం, మహదేవపురం సబ్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఏడీ శేషాద్రిరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు 24 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. సోలార్ విద్యుత్ వినియోగంపై ప్రతి గ్రామంలో అవగాహన కల్పించి, వారి వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీలైనంత వరకు విద్యుత్ అంతరాయం జరగకుండా సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీహరి తదితరలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ

- పరామర్శించిన మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి



రాణీపేట సీఎంసీలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి

గంగాధరనెల్లూరు: తిరుత్తణికి కావిడి ఎత్తుకొని సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానానికి మొక్కులు తీర్చుకోవడానికి వెళుతూ మార్గమధ్యంలో కారు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా ముగ్గురు తీవ్ర గాయాలైన సంగతి తెలిసిందే. గంగాధరనెల్లూరు నియోజకవర్గం జీడీ నెల్లూరు మండలంలోని గోవిందరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, ఆ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సురేంద్రరెడ్డి కుటుంబీకులైన ఆయన తమ్ముడు విశ్వనాథరెడ్డి, మనవడు శాన్విక్ రెడ్డి, గ్రామస్తురాలు పద్మ మృతి చెందగా సురేంద్రరెడ్డి భార్య, మరదలు కుమార్తె తీవ్ర గాయాలతో రాణిపేట సీఎంసీలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి హుటాహుటిన రాణిపేట సీఎంసీకి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాద ఘటనపై ఆరా తీసి విషయాలు తెలుసుకున్నారు. ప్రమాద ఘటనపై నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేవుడు కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని, మరణించిన వారికి సంతాపం తెలియజేశారు.

అశ్రునయనాలతో అంత్యక్రియలు

సురేంద్రరెడ్డి కుటుంబంలో కొన్ని సంవత్సరాలుగా ఇంటి పనులు చేస్తూ ఉన్న పద్మ మృతదేహాన్ని తమిళనాడు పోలీసులు తిరుత్తణిలో బుధవారం గ్రామస్తులకు అప్పగించారు. పద్మ మృతదేహాన్ని గోవిందరెడ్డిపల్లికి తీసుకుని వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మరణించిన పద్మకు కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో సమీప బంధువులు, గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. పద్మ మృతదేహం వద్ద చుట్టుపక్కల గ్రామస్తులు భారీగా చేరుకున్నారు. కారు ప్రమాదంలో మృతి చెందిన విశ్వనాథరెడ్డి, శాన్విక్ రెడ్డి మృతదేహాలను గురువారం కుటుంబీకులకు అప్పగించనున్నట్లు సమాచారం.



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

వధూవరులకు ఆశీస్సులు

పుత్తూరు: స్థానిక బీఎస్ఎన్ కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన నింద్ర మండలం వరదరాజు కండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ప్రతాప్‌రాజు బావమరిది మనోజ్‌కుమార్, లిఖిత వివాహ రిసెప్షన్‌లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో విజయపురం మండలం కోసలనగరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు శేఖర్ కుమారుడు వినోద్‌కుమార్ హేమవతి వివాహ రిసెప్షన్‌లో ఆమె పాల్గొని, వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

వృత్తి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి

పుత్తూరు: పాల్‌టెక్నిక్ విద్యార్థులు తమ వృత్తి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని తిరుపతి ఎస్వీ యూనివర్శిటీ డిప్యూటీ చీఫ్ ఎంప్లాయిమెంట్ బ్యూరో టి.శ్రీనివాసులు సూచించారు. బుధవారం స్థానిక పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో కెరీర్ ప్లానింగ్ స్ట్రాటజీ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఆసక్తి గల సబ్జెక్టును ప్రస్తుత పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాన్ని సంపాదించాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీకుమార్, కో–ఆర్డినేటర్ దుర్గాప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత కుటుంబానికి భరోసా

నగరి: మున్సిపల్ పరిధిలోని అనంతప్పనాయుడు కండ్రిగలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నేత విజయేంద్ర కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు కుమారస్వామిరెడ్డి పరామర్శించి, వారికి భరోసా ఇచ్చారు. బుధవారం అనంతప్పనాయుడు కండ్రిగలో నిర్వహించిన విజయేంద్ర కర్మక్రియల్లో ఆయన పాల్గొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపి పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుని సోదరులు చంద్ర, రమేష్‌లకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ కన్నియప్ప, నాయకులు బుజ్జిరెడ్డి, మధు, గణపతిశెట్టి, దామునాయుడు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.



విజయేంద్ర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సోదరుడు కుమారస్వామి రెడ్డి

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పుత్తూరు: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాయలసీమ సేవా సమితి(రాస్) ప్రతినిధి నాగరాజు సూచించారు. బుధవారం స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాస్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు–అనర్థాలు అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు స్నేహితుల ఒత్తిడితో, సినిమాలు, సోషల్ మీడియా ప్రభావాలతో మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల వాడకం నేర ప్రవృత్తిని ప్రేరేపిస్తుందని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసైతే విలువైన జీవితం ఛిద్రం అవుతుందన్నారు. సమాజంలో విద్యకు మించిన సంపద మరొకటి లేదన్నారు. పాపానాయుడుపేటలో మాదకద్రవ్యాల డీ అడిక్షన్ సెంటర్‌ను నిర్వహిస్తున్నామని, ఎవరైనా ఈ వ్యసనానికి లోనైతే తిరుపతిలోని రాస్ కేంద్రంలో సంప్రదించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య, రాస్ ప్రతినిధి దాము, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రాస్ ప్రతినిధి నాగరాజు

వైఎస్సార్ సీపీ ఎన్నడూ ప్రజల పక్షం

- జిల్లా విభజన జరిగినా నగరికే వసతులు సాధించిన మాజీ మంత్రి ఆర్కే రోజా
- తిరుపతి జిల్లాలో మండలాలను కలపడాన్ని వ్యతిరేకించం
- స్పష్టం చేసిన నగరి, నింద్ర, విజయపురం మండలాల వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు



సమ్మతి లెటర్ చూపుతున్న మున్సిపల్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు

నగరి: వైఎస్సార్ సీపీ ఎప్పుడూ ప్రజల పక్షమేనని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. బుధవారం మాజీమంత్రి నివాస కార్యాలయం వద్ద నగరి, నింద్ర విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలిపేందుకు అధికారులు కోరిన మేరకు సమ్మతి లెటర్లను ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గాన్ని చిత్తూరు జిల్లాలో కలపడం ప్రజలకు ఇబ్బందికరమని అప్పుడే గ్రహించిన మాజీ మంత్రి ఆర్కే రోజా దీనిపై అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డితో మాట్లాడారన్నారు. దీంతో చిత్తూరుకు మరీ దూరంగా ఉన్న పుత్తూరు, వడమాలపేట మండలాలను చిత్తూరు నుంచి తిరుపతి జిల్లాలో కలిపారన్నారు. ఈ క్రమంలో ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ముఖ్యమంత్రితో చర్చించి ఆయన సహకారంతో నగరి పట్టణంలోనే ఆర్డీఓ కార్యాలయం, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం తెప్పించారన్నారు. ప్రస్తుతం నగరి, నింద్ర, విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలిపే అంశం మళ్లీ తెరపైకి వచ్చిందని, ఇందుకు ప్రజాప్రతినిధుల నుంచి సమ్మతి లెటర్లు కోరారన్నారు. సాక్షాత్తు కలియుగదైవం వెంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి జిల్లాలో మండలాలను కలపడాన్ని ఎవరూ వ్యతిరేకించరన్నారు. అందుకే ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడే మాజీ మంత్రి ఆర్కే రోజా మూడు మండలాలను తిరుపతి జిల్లాలో కలిపేందుకు సమ్మతి లెటర్లు ఇవ్వాలని సూచించారన్నారు. దీంతో తాము సమ్మతి లెటర్లను అందిస్తున్నామన్నారు. తాము అందించిన సమ్మతి లెటర్లను మీడియాకు చూపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, మురుగ, మోహన్‌రాజ్, యాకోబు, నళిని, కోఆప్షన్ సభ్యుడు ఆనంద్, వైస్ఎంపీపీ బాలాజీ, నాయకులు కృష్ణమూర్తి, అరుణాచలం, బాషా తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు రిజర్వేషన్ అమలు చేయాలి



మాట్లాడుతున్న మాట్టూరు మురళి

పాలసముద్రం: మాదిగలకు 7 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర ఎమ్మార్పీఎస్ కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి ధనరాజ్ కిషోర్ తెలిపారు. బుధవారం పాలసముద్రం ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి మాట్టూరు మురళి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ మండల స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా యుగంధర్, ప్రధాన కార్యదర్శిగా చిన్నబ్బ, ఎంఎస్‌పీ అధ్యక్షుడిగా ఓ.రమేష్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాట్టూరు మురళి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగల సామాజిక వర్గానికి పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం 35 ఏళ్లుగా మాదిగలు అవిశ్రాంత పోరాటం చేశారని పేర్కొన్నారు. 7 శాతం రిజర్వేషన్ కల్పించినప్పుడే వారికి పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుందన్నారు. ఈ రిజర్వేషన్ కోసం గ్రామ స్థాయి నుంచి కమిటీలు వేసి ఉద్యమించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఎ.శివయ్య, ఎమ్మార్పీఎస్ యువకులు పాల్గొన్నారు.

నగరి డీఎస్పీ పల్లెనిద్ర

నింద్ర: మండలంలోని నేట్టేరి గ్రామంలో బుధవారం రాత్రి నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. యువకులు గ్రామంలోని సమస్యలపై స్పందించాలన్నారు. అనంతరం గ్రామంలోని విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. నగరి రూరల్ సీఐ భాస్కర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాగింగ్, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్ అవగాహన సదస్సులో డీఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

నగరి: విద్యార్థులు డ్రగ్స్, ర్యాగింగ్‌లకు దూరంగా ఉండాలని డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ వాడకంతో సమాజంలో వచ్చే దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యలను విద్యార్థులకు వివరించారు. వ్యసనాల బారిన పడి భవిష్యత్తును నాశనం చేసుకోరాదన్నారు. కళాశాలకు వచ్చే జూనియర్స్‌తో స్నేహభావంతో మెలగాలని, ర్యాగింగ్ పేరుతో వారిని వేధించకూడదన్నారు. ఇవి చట్ట విరుద్ధమన్నారు. సీఐ విక్రమ్ మాట్లాడుతూ డ్రగ్స్ క్రూరమైన ఆలోచనలను రేకెత్తిస్తాయన్నారు. మత్తు పదార్థాలకు విద్యార్థులు ఏ విధంగా ఆకర్షితులవుతారో విపులంగా వివరించారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తూ కంటబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


19 నుంచి వేణుగోపాలుని పవిత్రోత్సవాలు



శ్రీవేణుగోపాల స్వామి ఆలయం

కార్వేటినగరం: టీటీడీకి అనుబంధంగా ఉన్న శ్రీవేణుగోపాల స్వామివారి ఆలయంలో ఈ నెల 19 నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైదిక సంప్రదాయం ప్రకారం యాత్రీకులు, సిబ్బంది, భక్తులకు తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. దీంతో ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు ప్రతి ఏడాదీ భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులోభాగంగా ఆలయంలో శుద్ధి, పుణ్యాహవచనం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 19వ తేదీ ఉదయం ఆచార్య రుత్విక్‌వరణం, సాయంత్రం మృత్సంగ్రహణం, సేవాధిపతి తిరువీధి ఉత్సవంతో పవిత్రోత్సవాలకు అంకురార్పణ కార్యక్రమం చేయనున్నారు. 20వ తేదీ ఉదయం మూలవర్లకు తిరుమంజనం, మధ్యాహ్నం ఉభయ దేవేరులైన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి ఉత్సవమూర్తులకు వేదమంత్రోచ్ఛారణ నడుమ పవిత్రాల సమర్పణ నిర్వహించనున్నారు. సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు స్వామివారు గ్రామ వీధుల్లో తిరుచ్చి వాహనంపై విహరించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అత్యధిక సంఖ్యలో స్వామివారికి కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకుని, స్వామివారి కృపా కటాక్షాన్ని పొందాలని సూచించారు.

సంఘటితంగా సమస్యలు పరిష్కరించుకుందాం



అగముడయార్ సంఘం నేతలు

నగరి: సంఘటితమైతే సమస్యలు పరిష్కరించుకోవచ్చని అగముడయార్ మొదలియార్ సంఘం నాయకుడు సీకే దయానిధి అన్నారు. బుధవారం చిత్తూరులో నిర్వహించిన అగముడయార్ల ఆరాధ్య దైవాలైన చిన్న మరుదు, పెరియ మరుదు పాండియర్ల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి నగరి పట్టణం నుంచి వారు వివిధ వాహనాల్లో భారీగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులను ఎదిరించిన ప్రథమ నేతలుగా చిన్న మరుదు, పెరియ మరుదు కీర్తి గడించారని, అలాంటి నేతల విగ్రహావిష్కరణ అగముడయార్లు గర్వించదగిన అంశమన్నారు. దశాబ్దం క్రితం అగముడయార్లను రాష్ట్రంలో బీసీలుగా గుర్తించారని అయితే ఓబీసీలుగా గుర్తించలేదన్నారు. అగముడయార్లకు రాష్ట్రంలో మాత్రమే రిజర్వేషన్ వర్తిస్తోందని ఇతర రాష్ట్రాలలో జనరల్ కేటగిరీకి వెళ్లిపోతున్నామన్నారు. పాలక ప్రభుత్వాలు కేంద్రంతో చర్చించి అగముడయార్లను ఓబీసీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.